సాక్షి
నిర్మల్
7
మంగళవారం • 15 • అక్టోబర్ • 2024

బతుకమ్మ సంబురాలు

జిల్లాలోని మామడ, ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల్లో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో పూజించారు. సాయంత్రం ఒక్కచోట చేరి ఆడి పాడారు. రాత్రి ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఖానాపూర్ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో, కడెం మండలం మాసాయిపేట్, లింగాపూర్, ఎలగడప, అంబారిపేట్ తదితర గ్రామాల్లో, దస్తురాబాద్ మండలం మున్యాల, దస్తురాబాద్, ఆకొండపేట, మున్యాల తండా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. – మామడ/ఖానాపూర్/కడెం/దస్తురాబాద్


దస్తురాబాద్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు...


ఖానాపూర్: రంగపేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మామడ : పొన్కల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కడెం : మాసాయిపేట్‌లో బతుకమ్మ వేడుకల్లో మహిళలు

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీవోస్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: టీఎన్జీవోస్ సంఘం నిర్మల్ జిల్లా నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెలమల ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్, కోశాధికారి భీమ సురేందర్, ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జవాదు హుస్సేన్ జాయింట్ సెక్రెటరీ ఎస్.మోహన్‌రెడ్డి, మీరా జగదీశ్వర్, పట్టణ కోశాధికారి శ్రీకాంత్, సురేందర్‌రెడ్డి, సత్యం, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, సుధాకర్, ఆశన్న, బి.శ్రీనివాస్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.రవి, డి.లక్ష్మణ్, ఎం.శ్రీనివాస్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు

అనాథ బాలుడికి ఆశ్రయం


చైల్డ్‌లైన్ సిబ్బందితో బాలుడు

నిర్మల్‌చైన్‌గేట్: చిన్నతనంలోనే అమ్మానాన్నలను కోల్పోయి వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ భిక్షాటన చేస్తున్న వెలుమల కుమార్(08)ను సోన్ మండలవ బొప్పారంలో 1098 చైల్డ్‌లైన్ సిబ్బంది చేరదీశారు. సోమవారం బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశపెట్టారు. విచారణ చేపట్టిన బాలల సంక్షేమ సమితి అధ్యక్షుడు ఎండీ.వాహిద్ బాలుడిని అనాథగా గుర్తించి భైంసా పట్టణంలోని శ్రీవివేకానంద ఆవాసంలో ప్రవేశం కల్పించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు శ్రీలత, సైమన్ సుందర్, అనిల్ కుమార్, జిల్లా బాలల సంరక్షణ సమితి సిబ్బంది సగ్గం రాజు, ఓస శ్రీనివాస్, శైలజ, లక్ష్మణ్, మమత, కరుణ, నల్ల గంగాధర్, సుప్రియ, శ్రీదేవి పాల్గొన్నారు.

‘డీఎస్సీలో గిరిజనులకు అన్యాయం’


మాట్లాడుతున్న రాజేశ్‌నాయక్

కడెం: ఇటీవలే చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో గిరిజన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ ఆరోపించారు. 22, 23 ర్యాంకులు వచ్చిన ఎస్టీ అభ్యర్థులకు ఓపెన్ కేటాగిరీలో ఉద్యోగాలు ఇవ్వకుండా ఎస్టీ కేటాగిరీలో ఇవ్వడంతో గిరిజనులకు అన్యాయం జరిగిందని తెలిపారు. సాఫ్ట్‌వేర్ లోపాలు సవరించి నియామకాలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలకు రూ.50,923 అందజేత

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వ విద్యార్థులు సోమవారం రూ.50,923 అందజేశారు. కళాశాలలో 1978 నుంచి 2023 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహణకోసం ఇటీవల సేకరించిన నిధుల నుంచి ఖర్చులుపోను మిగిలిన నగదును కళాశాలలో విద్యార్థుల అవసరాల కోసం వినియోగించాలని ప్రిన్సిపాల్ హమీద్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ వాల్గోట్ కిషన్, సభ్యులు రాచమల్ల రాజశేఖర్, చిలివేరి వెంకట్రాములు, మడిగెల గంగాధర్, కామోజి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలి

భైంసాటౌన్: డిగ్రీ కళాశాలలకు రావాల్సిన స్కాలర్‌షిప్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బకాయిల కారణంగా నష్టపోతున్నామని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, అఖిల్‌సింగ్, విఠల్‌రావ్, వెంకటేశ్‌గౌడ్, బాలానంద్, రవి, లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, లోహిత్, వర్ధన్, శ్రీధర్ తదితరులున్నారు.

సీతాఫలాలు c/o పీచర

నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామం సీతాఫలాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. దాదాపు 90 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. - వివరాలు 8లో▸

యూబిట్‌పై ఈడీ

- కాయిన్ దందా కేసులో కీలక మలుపు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ లేఖ
- వివరాలు అందించిన పోలీసులు



నిర్మల్: దేశంలో ఆర్థిక నేరాల గుట్టువిప్పే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) చేతికి సంచలన ‘యూబిట్’ దందా కేసు వివరాలు అందాయి. రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు కావాలని ఈడీ జిల్లా పోలీసులకు లేఖ రాసింది. ఈమేరకు లేఖలో వారు పేర్కొన్న వివరాలను పోలీసులు అందించినట్లు తెలిసింది. ఇక కాయిన్‌దందా కేసు కీలకమలుపు తీసుకోబోతుందా..? ఈడీ ఏం చేయబోతోంది..? అనే చర్చ మొదలైంది. ఇటు జిల్లా పోలీసులు ఇప్పటికే ఈ కేసులో దర్యాప్తు చేస్తుండగా, ఇప్పుడు ఈడీ కూడా తోడవ్వడంతో అసలు ఈ కేసు ఎటుపోతుంది.. చివరకు ఏమవుందన్న చర్చ జరుగుతోంది.

అత్యాశతోనే..

ఎక్కడో విదేశాల్లో ఉంటూ ఇక్కడ గల్లీగల్లీకి కాయిన్ దందాను తీసుకొచ్చిన తీరే అందరినీ విస్మయపరుస్తోంది. పెట్టిన పెట్టుబడులకు మూడునాలుగింతల లాభాలు వస్తుండటంతో చిన్నచితకా ఉపాధులు పొందేవారే కాదు.. ఏకంగా మేధావివర్గంగా పేరున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, చివరకు పోలీసు కానిస్టేబుళ్లు సైతం ఈ దందాలో భాగస్వాములుగా మారారు. తక్కువ మొత్తం పెట్టుబడికే ఊహించని లాభాలు వస్తాయన్న వలలోనే వీరంతా చిక్కుకున్నారు. చైన్‌లింక్ దందా కావడంతో వీరిని చూసి మరొకరు అన్నట్లు పెరుగుతూ పోయారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రధానంగా ఉపాధ్యాయులు అధికశాతం ఇందులో భాగస్వాములు కావడంతోపాటు మిగతావారిని ప్రోత్సహించారు. అలా.. జిల్లాలో వేగంగా యూబిట్ వ్యాపించింది. ఈ దందా సాగుతున్న తీరుపై అనుమానాలు, ఫిర్యాదులు రావడంతో జిల్లా పోలీసులు దీనిపై దృష్టిపెట్టి, ఎనిమిది మందిని అరెస్టు చేశారు.

ఈడీ రాకతో..

ఇప్పటి అరెస్టయిన ఎనిమిది మందిలో ఐదుగురు బెయిల్‌పై వచ్చారు. హైకోర్టు వారికి బెయిల్ ఇచ్చిన తర్వాత మళ్లీ కొంతమంది ఈ దందాపై ఆశలు పెంచడం ప్రారంభించారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు లేవంటూ వాట్సప్‌లలో పోస్టులు పెట్టారు. ఈక్రమంలో ఈడీ ఎంటర్ కావడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇప్పటి వరకు ఎస్పీ జానకీషర్మిల నేతృత్వంలో జిల్లా పోలీసులే దర్యాప్తు చేస్తున్నారు. వీరికి ఇప్పుడు ఈడీ తోడు కావడంతో దందాపై ఆశలు పెట్టుకున్నవారికి మింగుడు పడటం లేదు.

వివరాల అందజేత..

ఆర్థిక అంశాలతో ముడిపడిన కేసు కావడం, ఇందులో డబ్బంతా ఎటుపోతుందన్న విషయం స్పష్టంగా లేకపోవడంతోనే పోలీసులతోపాటు ఈడీ ఈ కేసుపై దృష్టిపెట్టినట్లు చెబుతున్నారు. దాదాపు ఈకేసును నిర్మల్ పోలీసులు చాలావరకు ముందుకు తీసుకెళ్లారు. ఇప్పటికే లోతుగా అన్ని వివరాలను సేకరించారు. ఈనేపథ్యంలోనే తాజాగా ఈడీ లేఖ రాసిన తక్కువ వ్యవధిలోనే పోలీసులు వారికి పూర్తి వివరాలు అందించగలిగారు. జిల్లాలో దందా సాగిన తీరు, కీలకంగా ఉన్నవారు, వారి బ్యాంకు ఖాతాలు, ఇతరత్రా వివరాలన్నీ ఈడీకి అప్పగించినట్లు తెలుస్తోంది.

ఎటుపోతుందో..

జిల్లాలో చాలా నెలలుగా యూబిట్ దందా సాగుతున్నా.. సరిగ్గా ఆగస్టు 31న జిల్లా పోలీసులు ఐదుగురు కీలక వ్యక్తులను అరెస్టు చేయడంతో అందరికీ తెలిసింది. అప్పటి వరకు యూబిట్ అంటే తక్కువ పెట్టుబడి పెడితే.. ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయన్నదే చాలామందికి తెలుసు. చాలామంది పెట్టుబడులు పెట్టారు. కానీ.. ఇందులో ఎక్కడో ఏదో తేడా ఉందన్న ఆలోచన చేసిన వాళ్లు చాలావరకు ఈ దందాకు దూరంగా ఉన్నారు. ఇప్పుడు అలాంటి వాళ్లంతా ‘హమ్మయ్యా.. సేఫ్ అయ్యాం..’ అని ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు ఇందులో భాగస్వాములైన వారు ఈడీ రాకతో మళ్లీ కంగారు పడుతున్నట్లు తెలుస్తోంది.

వివరాలు అందించాం..

యూబిట్ కేసుకు సంబంధించి ఈడీ రాసిన లేఖలో అడిగిన వివరాలను అందించాం. పోలీసు శాఖ పరంగా ఈ కేసులో విచారణ కొనసాగుతుంది. –జానకీషర్మిల, ఎస్పీ

కొలువుదీరిన శారదమాత



భైంసాటౌన్: పట్టణంలో శారదమాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా దేవీ నవరాత్రి ఉత్సవాల అనంతరం శారదమాత విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య సంఘంతోపాటు బ్రాహ్మణగల్లిలోని రాధాకృష్ణ మందిర్‌లో శారదమాత విగ్రహాలు ప్రతిష్ఠించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఐదురోజులపాటు అమ్మవారికి పూజలు చేసి నిమజ్జనం చేస్తారు.

రైతు లేకుంటే రాజ్యం లేదు

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి


పీచరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: రైతు లేకుంటే రాజ్యం లేదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా, వరి కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర సమయంలో కూడా చెక్కు చెదరకుండా ఉన్నామంటే అందుకు కారణం రైతులే అన్నారు. రైతులకు ప్రభుత్వం మోసం చేయడం తగదన్నారు. ఇప్పటి వరకు చాలా మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కూడా జరగలేదన్నారు. కౌలు రైతులకు ఇస్తామన్న రైతుబంధు, రైతులకు ఇస్తామంటున్న ఇతర హామీల కోసం ఇటీవలే 24 గంటల దీక్ష చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం సన్న రకంకు మాత్రమే ఇస్తామంటున్నారన్నారు. త్వరలోనే వరి కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించాలని అడిషనల్ కలెక్టర్‌కు సూచించామన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చే వరకూ రైతుల పక్షాన పోరాడుతామన్నారు. సన్న రకం వరికి ఇస్తామన్నట్లుగానే పసుపు, మొక్కజొన్న, సోయాకు కూడా బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాని కోరారు. మండల ప్రజలు కోరినట్లుగా లక్ష్మణచాంద నుంచి సోన్ వరకు రోడ్డు మంజూరు కోసం కేంద్రం నుండి నిధులు మంజూరు చేయించామన్నారు. గుండంపెల్లి నుంచి దిలావపూర్ వరకు రూ.25 కోట్లతో రోడ్డు మంజూరు చేయించామన్నారు. గాంధీనగర్ నుంచి చిట్యాల్ వరకు రోడ్డును కూడా మంజూరు చేయించామని తెలిపారు. రానున్న కాలంలో నిర్మల్ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేంద్రం నుంచి తెస్తామని తెలిపారు. ఇందులో డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, తహసీల్దార్ జానకి, నాయకులు అడ్వాల రమేశ్, రాజేశ్వర్, ముత్యంరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

- బాసర గోదావరి వద్ద నిమజ్జనం


గోదావరినదిలో నిమజ్జనం చేస్తున్న దుర్గామాత భక్తులు ..

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీజ్ఞాన సరస్వతి కొలువుదీరిన క్షేత్రానికి పవిత్ర గోదావరి నదిలో దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాల శోభాయాత్ర అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు కొనసాగింది. సోమవారం ఉదయం గోదావరి పుష్కర ఘాట్‌లకు చేరుకున్న అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గోదావరినదిలో నిమజ్జనం చేశారు. దుర్గామాత విగ్రహాల వాహనాలు ఎక్కువగా రావడంతో బ్రిడ్జిపై కొద్దిసేపు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల పోలీసులు సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

నిర్మల్ రూరల్: డీఎస్సీ- 2024లో ఎంపికైన ఉపాధ్యాయులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఉద్యోగ నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్లు, భాష ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 11 గంటలకు, ఎస్జీటీలు మధ్యాహ్నం 1 గంటకు జరిగే పాఠశాలల ఎంపిక కౌన్సెలింగ్‌కు రావాలని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్


నిరసన తెలుపుతున్న కళాశాలల యజమానులు

నిర్మల్ రూరల్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. మూడేళ్లుగా స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల కాకపోవడంతో కాలేజీలు నిర్వహించలేకపోతున్నామని, అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం కూడా కష్టంగా ఉందని, భవనాలకు అద్దె చెల్లించక ఇబ్బంది పడుతున్నామన్నారు. బకాయిలు చెల్లించాలని అనేకసార్లు మంత్రులకు, సంబంధిత అధికారులకు, కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు ఇచ్చామన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. బంద్ గురించి ఇప్పటికే ఆయా యూనివర్సిటీల రిజిస్ట్రార్లకు రాతపూర్వకంగా వినతిపత్రం అందించామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల అయ్యేవరకు బంద్ కొనసాగిస్తామన్నారు. ఇందులో సంఘ నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, అఖిలేశ్‌సింగ్, విఠల్‌రావు, వెంకటేశ్‌గౌడ్, బాలానంద్, రవి, లక్ష్మణ్, సంజీవ్, శ్రీనివాస్, లోహిత్, వర్ధన్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్వామీజీపై చర్య తీసుకోవాలి

- ముస్లిం జేఏసీ డిమాండ్


ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్ టౌన్: అనుచిత వ్యాఖ్యలు చేసిన యూపీకి చెందిన స్వామీజీపై కఠి న చర్యలు తీసుకోవాలని నిర్మల్ ముస్లిం జా యింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం బంద్‌ను నిర్వహించారు. స్వచ్ఛందంగా వ్యాపార దుకాణాలు మూసి ఉంచారు. పూజారిగా పనిచేసే స్వామీజీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వినతిపత్రం అందజేశారు. తర్వాత పోలీస్ ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఎస్పీ జానకీషర్మిలకు వినతిపత్రం అందజేశారు. స్వామీజీపై కేసు నమోదు చేయాలని కోరారు.ఇందులో ముస్లిం జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



భైంసాలో భారీ వర్షం..!

భైంసాటౌన్: పట్టణంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంటపాటు జోరువాన కురవగా, గాంధీగంజ్‌లో విక్రయానికి తెచ్చిన సోయా పంట తడిసింది. రైతులు ఇబ్బంది పడ్డారు. కుప్పల మధ్య నీరు నిలవకుండా కాపాడుకునే ప్రయత్నం చేశారు.


నిలిచిన నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్


దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు తక్షణం స్పందించాలని, సమస్యలకు పరిష్కారం చూపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని సూచించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు లక్ష్యం చేరాలి

- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

నిర్మల్‌చైన్‌గేట్: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యానికి చేరుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రాంచందర్‌రావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 20 లక్షలకుపైగా సభ్యత్వ నమోదు జరిగిందని తెలిపారు. 50 లక్షల టార్గెట్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజుకుమార్‌రెడ్డి, రావుల రాంనాథ్, సత్య నారాయణగౌడ్, అయ్యన్నగారి భూమయ్య, మేడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, వడ్డే రాజేందర్‌రెడ్డి, సాదం అరవింద్, అర్జున్, సాగర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు

దండేపల్లి: మండలంలోని గూడెంలో శనివారం దసరా పండుగ రోజున పరస్పర దాడులకు పాల్పడిన ఇరువర్గాలపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఏడుగురితో పాటు, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు

రెబ్బెన: గోలేటి పంచాయతీ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన బోగే ఉపేందర్‌పై ఆదివారం రాత్రి దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గోలేటి సర్పంచ్‌గా పోటు సుమలత పనిచేసిన సమయంలో మరుగుదొడ్ల నిర్మాణాల విషయంలో అవినీతి జరిగినట్లు ఉపేందర్ జిల్లా కలెక్టర్‌తో పాటు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న మాజీ సర్పంచ్ భర్త పోటు శ్రీధర్‌రెడ్డి ఆదివారం రాత్రి ఉపేందర్‌కు ఫోన్ చేసి ఇంటినుంచి బయటకు రావాలని చెప్పగా నిరాకరించాడు. దీంతో శ్రీధర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు పంబాల శ్రీనివాస్, పరికిపండ్ల సత్యనారాయణ అతని ఇంటికి వెళ్లి దాడికి పాల్పడటంతో పాటు చంపుతానని బెదిరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కులం పేరిట దూషించిన ఇద్దరిపై కేసు

నెన్నెల: గొల్లపల్లి గ్రామానికి చెందిన పొన్నాల వెంకటస్వామిని కులం పేరిట దూషించిన తండ్రీకొడుకులు వేల్పుల రాజం, సతీష్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తన భూమిలో వాంతులు చేసుకున్నావంటూ రాజం దుర్భాషలాడుతూ వెంకటస్వామిని కర్రతో కొట్టాడు. దీంతో బాధితుడు కుల పెద్దలతో కలిసి అతని ఇంటికి వెళ్లి ప్రశ్నిస్తే కుమారుడు సతీష్‌తో కలిసి ఎదురుదాడికి దిగాడని ఆయన పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని ఇక్బాల్‌పూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాఫేఖాన్ తన వ్యక్తిగత పనినిమిత్తం బైక్‌పై ఖానాపూర్ వచ్చి నిర్మల్‌కు తిరిగి వెళ్తుండగా ఇక్బాల్‌పూర్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడి

జైపూర్: ఇంటి బయట ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారిపై ఓ కామాంధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. జైపూర్ మండలంలోని ఓ గ్రామంలో జరిగిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన సంకె మల్లేశ్ అలియాస్ మల్లయ్య కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతని ఇంటి సమీపంలో ఉంటున్న బాలిక ఆడుకోవడానికి బయటకు వెళ్లగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుస్తూ ఇంటికి వెళ్లడంతో గమనించిన తల్లిదండ్రులు జైపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సీతాఫలాలు C/O పీచర



ఈ చిత్రంలో కనిపిస్తున్న దంపతులు నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామానికి చెందిన గుర్రం లింగవ్వ, లింగన్న. గ్రామ సమీపంలోని తమ చేను పక్కనే ఉన్న చెట్లకు కాసిన సీతాఫలాలను తెంపి పక్కనే ఉన్న రోడ్డుపై ఉంచి విక్రయిస్తారు. ఈ దంపతులే కాదు.. గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ చేనులో కాసిన సీతాఫలాలను గ్రామంతో పాటు జిల్లా కేంద్రంలో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.



నిర్మల్ పాత బస్టాండ్ ఏరియాలో సీతాఫలాలు అమ్ముతున్న పీచర గ్రామస్తులు

- 35 ఏళ్లుగా వాటిపైనే ఆధారపడిన 90 కుటుంబాలు
- నిర్మల్‌కు తరలించి విక్రయం
- ఒక్కో పండుకు రూ.30కు పైనే
- బుట్టకు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు

లక్ష్మణచాంద(నిర్మల్): శీతాకాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లలో పేదోడి ఆపిల్‌గా పిలువబడే సీతాఫలం ఒకటి. ఏ కాలంలో లభించే ఫలాలను ఆ కాలంలో తినాలని పెద్దలు చెప్తుంటారు. శీతాకాలంలో సీతాఫలాలు ఎక్కువగా లభిస్తుంటాయి. ఇందులో మంచి పోషక విలువలు ఉండటంతో ప్రజలు వీటిని తినడానికి కూడా ఎక్కువగా ఇష్టపడుతుంటారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామం సీతాఫలాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది.

మధుర ఫలానికి మహా డిమాండ్

దండేపల్లి(మంచిర్యాల): ప్రకృతి సిద్ధంగా లభించే సీతాఫలాల సీజన్ వచ్చేసింది. ఏటా అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఇవి సమృద్ధిగా లభిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో మాత్రం వీటిని తోటల్లో పండిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో ఈ తోటలు పెద్దగా లేక పోవడంతో జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన పలువురు వ్యాపారులు ఈ ప్రాంతానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఒకప్పుడు దారివెంట, గుట్టల్లో చెలకల్లో ఎక్కడ పడితే అక్కడ సీతాఫలం చెట్లు కనిపించేవి. కానీ ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి. కొంతమంది ఇంటి సమీపంలో కూడా చెట్లు పెంచుకునేవారు. కానీ కోతుల బెడద తీవ్రతరం కావడంతో ఉన్న చెట్లను కూడా తీసివేస్తున్నారు. చెట్లు అంతరించి పోవడంతో కొద్దిపాటిగా లభిస్తున్న పండ్లకు అధికధరలు పెట్టి కొనాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

చేను గట్లపైనే చెట్లు..

లక్ష్మణచాంద మండలంలోనే అత్యధిక పంటలు పండించే గ్రామం పీచర. వాణిజ్య పంటలైన పసుపు, పత్తి, గెర్కిన్ దోస వంటి పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. వీటితో పాటుగా తమ పొలాల గట్లపైనే సీతాఫలం మొక్కలు కూడా పెంచుతున్నారు. అవే రైతులకు ఆదాయం సమకూర్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతున్నాయి.

90 కుటుంబాలకు జీవనోపాధి

గ్రామంలోని దాదాపు 90 కుటుంబాలు సీతాఫలాలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. శీతాకాలంలో ప్రతిరోజు తెల్లవారుజామున 4 గంటలకే సీతాఫలాలు బుట్టల్లో పెట్టుకుని దాదాపు 40 నుంచి 60 మంది వరకు 6 ఆటోలలో జిల్లా కేంద్రానికి వస్తుంటారు. పాత బస్టాండ్ ప్రాంతంలోని మారుతి మెగామార్ట్ ముందు, మారెమ్మ ఆలయం వద్ద, స్వామి వివేకానంద విగ్రహం వద్ద విక్రయిస్తారు. ఇందులో కొందరు సొంత చెట్లు ఉన్న రైతులు కాగా మరి కొందరు ఇతరుల చెట్లకు డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తారు.

20 ఏళ్లుగా అమ్ముతున్నా..



మా చేను గట్లపై పెంచిన సీతాఫలం చెట్లకు ఏటా కాయలు కాస్తున్నాయి. 20 ఏళ్లుగా సీతాఫలాలను నిర్మల్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నా. కష్టపడితే మంచి ఆదాయం వస్తుంది.

– మూగ రత్న, పీచర

రోజూ రెండు బుట్టలు అమ్ముతా



ప్రతిరోజు ఉదయం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌కు వచ్చి మధ్యాహ్నం వరకు ఉండి రెండు బుట్టలు అమ్ముతా. ఒక్కో బుట్టకు రూ.1200 నుంచి రూ.1500 వరకు వస్తాయి. ఖర్చులు పోనూ ఇప్పుడైతే మంచి లాభమే ఉంది.

– నవ్య, పీచర

కాయలు తెంపి నేరుగా విక్రయం..

గతంలో సీతాఫలాలు తెంపి వాటిని వరిగడ్డిలో మాగబెట్టి పండిన తర్వాత అమ్మేవారు. కానీ ప్రస్తుతం చెట్లపైనే కాయలు పండిన తర్వాత తెంపి విక్రయిస్తుండడంతో పండ్లు తాజాగా ఉంటున్నాయి. వీటికి ఎలాంటి రసాయనిక మందులు వినియోగించడంలేదు. దీంతో పండ్లు మంచి రుచిగా ఉండటంతో ఎంత ధర అయినా కొనుగోలు చేయడానికి ప్రజలు ముందుకు వస్తున్నారు.

ఫలాలకు భలే డిమాండ్...

నిర్మల్ మార్కెట్‌లో ఒక్కో పండుకు రూ.30 నుంచి రూ.120 వరకు ధర పలుకుతోంది. పెద్ద సైజులో ఉన్న పండ్లు ఒక్కటి రూ.100 నుంచి 150 వరకు ధర ఉంది. 12 నుంచి 20 పండ్లు ఉండే బుట్టకు రూ.1,200 నుంచి రూ.1500 చెల్లిస్తున్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత



పర్సు అందజేస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

మంచిర్యాలక్రైం: హాజీపూర్ మండలం టీకానపల్లికి చెందిన పన్యాల అనుష సోమవారం వ్యక్తి గత పనిమీద మంచిర్యాలకు వచ్చింది. ఓ హోటల్‌లో టిఫిన్ చేసి అక్కడే పర్స్ మర్చిపోయి వెళ్లింది. సదరు హోటల్ యజమాని పర్సును బ్లూకోల్ట్స్ పోలీసులకు అప్పగించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా సదరు మహిళను గుర్తించిన పోలీసులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీఐ బన్సీలాల్ సమక్షంలో రూ.10వేల నగదుతో ఉన్న పర్సును అందజేశారు. బ్లూకోల్ట్స్ పోలీసులు రాజన్న, లక్ష్మణ్‌లను ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సీలాల్ అభినందించారు.

రుణమాఫీ చేయాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

ఉట్నూర్‌రూరల్: పంట రుణమాఫీ చేయాలని కోరుతూ సోమవారం శ్యాంపూర్‌లో ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి సీజన్ సమీపిస్తున్నా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నేటికీ ఇవ్వలేదన్నారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు జ్ఞానేశ్వర్, చందు, లక్ష్మణ్, విఠల్, శ్యాంరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీలో పడి వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మార్త కుమారస్వామి (53)కొంతకాలంగా మద్యానికి బానిసై కాలనీలో ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి రెండవ జోన్‌లో ఉంటున్న చిన్నమ్మ ఇంటికి వెళ్లి భోజనం తీసుకుని ఇంటికి బయలుదేరాడు. సోమవారం ఉదయం సమీపంలోని డ్రెయినేజీలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజశేఖర్ మృతదేహాన్ని బయటకు తీసి మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహం వద్ద క్వాటర్ బాటిల్, అన్నం కవర్, చెప్పులు ఉన్నాయి. మృతుని భార్య, పిల్లలు స్థానికంగా లేకపోవడంతో పూర్తి వివరాలు వెల్లడించలేమని ఎస్సై తెలిపారు.

దుర్గామాత శోభాయాత్రలో అపశ్రుతి

- బొలెరో వాహనం ఢీకొని యువకుడు మృతి



నందు (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గామాత శోభాయాత్రలో అపశ్రుతి నెలకొంది. ఎస్సై సనత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సీసీసీ నస్పూర్‌కు చెందిన గుమాస శ్రీనివాస్-చంద్రకళ దంపతుల కుమారుడు నందు(16) సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి రెడ్డికాలనీ దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్నాడు. ఎమ్మార్వో ఆఫీస్‌లైన్ వరకు వెళ్లగానే జనరేటర్ స్టార్ట్ చేసేందుకు నందుతో పాటు మరో స్నేహితుడు బెల్లంకొండ రాకేష్ రోడ్డుపై నిలబడి ఉన్నారు. పక్క నుంచి అతివేగంగా వచ్చిన ఓ బొలెరో వాహనం ఢీకొట్టడంతో నందుకు తీవ్రగాయాలయ్యాయి. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకోసం కరీంనగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని సోదరి వీణారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలానికి చెందిన నాంపల్లి బాపు (46) రెండేళ్ల క్రితం బతుకుదెరువుకోసం మంచిర్యాలకు వలస వచ్చి మజీద్‌వాడలో నివాసం ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని ఒకరు..

నస్పూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు. నస్పూర్ గేట్ ఏరియాకు చెందిన మందపెల్లి మునీందర్ (56) సోమవారం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య హేమలత, కూతురు దీప్తి ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఉట్నూర్‌రూరల్: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగంగాపూర్‌కు చెందిన చిలుకల శ్రీనివాస్ (30) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఐదు రోజుల క్రితం పురుగుల మందు తాగడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మరొకరు...

మండలంలోని దుర్గాపూర్‌కు చెందిన తొడసం మంజులత (23) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి జంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు...

భీమిని(బెల్లంపల్లి): మనస్తాపంతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగారాం తెలిపిన వివరాల ప్రకారం భీమిని గ్రామానికి చెందిన జంగంపల్లి రాకేష్ (35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల మద్యానికి బానిసై భార్య గౌరును వేధిస్తుండడంతో పది రోజుల క్రితం పిల్లలను తీసుకుని కన్నెపల్లిలోని పుట్టింటికి వెళ్లింది. ఆదివారం మద్యం సేవించి కన్నెపల్లికి వెళ్లిన రాకేష్ ఇంటికి రమ్మని భార్యతో గొడవపడ్డాడు. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురై స్థానిక వైన్‌షాప్ సమీపంలో పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని సోదరుడు చెంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

14 మందికి రిమాండ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఈఎస్ఐ చౌరస్తా, మెయిన్‌మార్కెట్ ఫ్లైఓవర్ సమీపంలోని జ్యూస్ సెంటర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘటనలో 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రామానుజం తెలిపారు. ఈ గొడవలో పాల్గొన్న మరి కొంతమందిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఎలాంటి గొడవలు చెలరేగినా సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరమన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటు వెంటనే విడుదల చేయాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. మూడేళ్లుగా ఫీజులు చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వెళ్తే కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం బోయవాడకు చెందిన అనసూయ, తమ గ్రామానికి పాఠశాల భవనం మంజూరు చేయాలని గాదిగూడ మండలం ధర్మగూడ గ్రామస్తులు, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పించాలని ఇచ్చోడకు చెందిన అర్చన కోరారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. అనంతరం కొత్తగా నియామకమైన ఎస్జీటీ అభ్యర్థులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో మనోహర్, ఏవో దామోదర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పెసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుమురంభీం కాలనీలో సౌకర్యాలు కల్పించాలి



పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని బట్టి సావర్గం శివారులోని సర్వే నంబర్ 72లో ఆదివాసీలు నివాసం ఉంటున్న కుమురంభీం కాలనీలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ మాట్లాడుతూ కాలనీలో నీళ్లు, కరెంటు, విద్య, వైద్యం,రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పుష్పరాణి, ఆడ హన్మంత్‌రావు, మూర్తి, మోతీరాం, జనార్దన్, తొడసం ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు రాథోడ్ కార్తీక్, నగేష్

ఆదిలాబాద్: ఈనెల 7, 8 తేదీల్లో హన్మకొండలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. బజార్‌హత్నూర్ మండలం జాతర్లలోని తెలంగాణ గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన రాథోడ్ కార్తీక్ అండర్-14 విభాగంలో ట్రయథ్లాన్ గ్రూప్-బి పోటీలకు, ఉట్నూరు గిరిజన క్రీడా పాఠశాలకు చెందిన నగేష్ గ్రూప్ సీ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి తెలిపారు. ఈ నెల 16 నుంచి 19 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఉన్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

పాలు పొంగించి.. పత్తిపంట తీసి



పిప్పల్‌కోటిలో పాలు పొంగిస్తున్న మహిళా రైతు

తాంసి: జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంట ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తోంది. పత్తిని తీసేముందు రైతులు పంటచేలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పత్తికర్రల మధ్య ఉయ్యాల కట్టి సీతమ్మను తయారుచేస్తారు. ఐదు రాళ్లను ఏర్పాటు చేసి పంచ పాండవులుగా భావించి పూజలు నిర్వహిస్తారు. చిన్నకుండలో పాలుపోసి వాటిని పొంగిస్తారు. అనంతరం పత్తితీతను ప్రారంభిస్తారు. సోమవారం మంచిరోజు కావడంతో తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల రైతులు చేలల్లో పాలు పొంగించి పత్తి ఏరివేతకు శ్రీకారం చుట్టారు.

శోభాయాత్రలో అల్లరిమూకల హల్‌చల్

- ఓ కుటుంబంపై రాళ్లతో దాడి
- ఒకరికి స్వల్ప గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గాదేవి శోభాయాత్రలో అల్లరిమూకలు హల్‌చల్ చేసిన ఘటనను ఓ పోలీస్ అధికారి తీసిన వీడియో వైరల్‌గా మారింది. బాధితుల కథనం మేరకు డీజేసౌండ్‌తో వెళ్తున్న శోభాయాత్ర అదేకాలనీకి చెందిన చింతపండు రాజేశం ఇంటిముందు ఆగింది. సౌండ్ ఎక్కువగా రావడంతో ఇంటియజమాని కుమారుడు శిరీష్ దయచేసి కొంత ముందుకు వెళ్లి ఆగమని కోరాడు. దీంతో ఆగ్రహానికి గురైన కొందరు యువకులు అతనిపై దాడికి పాల్పడగా ముక్కుపై గాయమైంది. అడ్డుకోబోయిన అతని తల్లిదండ్రులు, స్నేహితులపై కూడా దాడికి దిగారు. బాధితులు తప్పించుకుని ఇంట్లోకి వెళ్లగా రాళ్లతో ఇంటిపై దాడి చేసిన చేసిన వీడియో వైరల్ కావడంతో జిల్లా కేంద్రంలో చర్చనీయాంశమైంది. సోమవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, ఈ కేసులో దాడికి పాల్పడిన అబ్దుల్ ఆఫ్రోజ్, బిట్టు, రాజు, మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని యువకుడు..

బాసర: బాసర ట్రిపుల్ ఐటీ కళాశాల సమీపంలోని నిజామాబాద్, భైంసా ప్రధాన రహదారిపై ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు చెందిన కుంటోల్ల గన్నీ (26) ఆదివారం ఓ పనినిమిత్తం మరోవ్యక్తితో కలిసి బాసరకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ట్రిపుల్ ఐటీ కళాశాల సమీపంలోకి వెళ్లగానే బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గన్నీ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వట్టంవార్ మణికంఠ (30) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం మృతుని తల్లిదండ్రులతో పాటు భార్య ప్రణీత భైంసాలో తన మేనకోడలు సారీ ఫంక్షన్ ఉండడంతో ఉదయం ఆదిలాబాద్ నుంచి భైంసాకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. తలుపులకు లోపలినుంచి గొళ్లెం పెట్టి ఉండగా అతని భార్య ఎంతపిలిచినా తలుపులు తీయకపోవడంతో అత్తామామలకు విషయం తెలిపింది. కిచెన్ తలుపు పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ముందుగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ ఎస్సై సయ్యద్ ఇసాఖ్ తెలిపారు.

వృద్ధుడు బలవన్మరణం



రాజయ్య (ఫైల్)

లక్సెట్టిపేట(మంచిర్యాల): మనస్తాపంతో వృద్ధుడు బలవన్మరణం చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని బోయవాడకు చెందిన దూసముడి చిన్న రాజయ్య (69) కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినప్పటికీ నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను.అర్చన్‌ఫైనాన్స్,పార్టిబా. 8500236824. [T-283]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185480]

■ అర్జెంట్‌గా మూతపడ్డ కంపెనీకి మేనేజర్స్, సూపర్ వైజర్స్, వాచ్ మెన్స్ మరియు ఆఫీస్ బాయ్స్ కావలెను. సిర్పూర్ పేపర్ మిల్ ప్రక్కన సర్ సిల్క్ కంపెనీ ఖాఘజ్ నగర్. మంచి జీతం, ఉచిత గృహ వసతి కుటుంబం తో ఉండవలెను. సంప్రదించండి. 9440050036 / 7569783139 / 6300411620 Email: mktg.sec2011@gmail.com [SCA24000390]

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14726]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,